సాక్షి అనకాపల్లి

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



డీఆర్‌ఎం తనిఖీలు

విశాఖ: విశాఖ–రాయగడ సెక్షన్ పరిధిలో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి శనివారం విండో ట్రయలింగ్ తనిఖీలు చేపట్టారు.



సామాన్యులకు 5జీ సేవలు

విశాఖ: సామాన్యులకు 5జీ సేవలు చేరువ చేయాలని విశాఖలో జరిగిన సమావేశంలో ట్రాయ్ సలహాదారు మునిశేఖర్ అన్నారు.

వర్ష సూచన

అనకాపల్లి టౌన్ : రాగల అయిదు రోజుల్లో ఏప్రిల్ 2న 8 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశముందని, మిగిలిన రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం తెలిపారు.



అనకాపల్లి	
ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
6-13	4-37
నర్సీపట్నం	
6-17	4-37

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

108లో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం



108 అంబులెన్స్‌లో బిడ్డకు జన్మనిచ్చిన దివ్య

కె.కోటపాడు: హైరిస్క్ గల గర్భిణిని శుక్రవారం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే సుఖప్రసవం అయింది. దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లికి చెందిన జనపరెడ్డి దివ్యకు నెలలు నిండడంతో తల్లిదండ్రులు శుక్రవారం కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అత్యవసర పరిస్థితి కావడంతో వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించాల్సిందిగా తెలిపారు. కె.కోటపాడుకు చెందిన 108 వాహనంలో దివ్యను తరలిస్తున్న సమయంలో వేపగుంట ప్రాంతం వద్దకు వాహనం చేరుకునే సమయానికి పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 మెడికల్ టెక్నీషియన్ జి.రామలక్ష్మి సురక్షితంగా ప్రసవం చేశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. వీరిని తదుపరి వైద్యసేవల కోసం కేజీహెచ్ తరలించారు.

మునగపాక పంచాయతీ ఈవో సస్పెన్షన్

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక ఎగ్జిక్యూటివ్ అధికారి పి.అజయ్‌బాబును సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం మునగపాక మండల పరిషత్‌కు మెయిల్ వచ్చింది. అజయ్ బాబు గతంలో శ్రీకాకుళం జిల్లాలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసే కాలంలో జరిగిన విషయానికి సంబంధించి ఈ ఉత్తర్వులు వచ్చినట్టు మండల పరిషత్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం అజయ్‌బాబు మునగపాక పంచాయతీ ఈవోగా పనిచేస్తున్నారు. ఆయన సస్పెండ్ కావడంతో తాత్కాలికంగా ఈవోఆర్డీ ఈశ్వరరావుకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు.

కేఎల్‌యూ ప్రవేశ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం విడుదల చేశారు. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో అమర్‌నాథ్ పాల్గొని బటన్ నొక్కి ఫలితాలు విడుదల చేసి, ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఉపయోగపడే పరిశోధనలపై యువత దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చదువు పూర్తి చేసుకుని విద్యార్థి బయటకు వచ్చిన వెంటనే ఉద్యోగం కల్పించాలన్న లక్ష్యంతో స్కిల్ హబ్ సెంటర్ ద్వారా తర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో ఐ స్పేస్ పేరిట ఐకానిక్ బిల్డింగ్ ఏర్పాటు కానుందన్నారు. కేఎల్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాలు www.kluniversity.in వెబ్‌సైట్‌లో లభిస్తాయని తెలిపారు. కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ షణ్ముఖ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్స్ బీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఉజ్వల విశాఖ



జీఐఎస్‌ను ప్రారంభిస్తున్న సీఎం జగన్, చిత్రంలో రిలయన్స్ అధినేత అంబానీ, తదితరులు (ఫైల్)



విద్యుత్ వెలుగుల్లో విశాఖ నగరం

- మూడు నెలల్లో నాలుగు కీలక అంతర్జాతీయ సదస్సులు
- వేదికగా నిలిచిన మహా నగరం
- పెట్టుబడుల సదస్సుతో వాణిజ్య కేంద్రంగా వైజాగ్
- తీపి జ్ఞాపకాలనందించిందన్న జీ–20 దేశాల ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం : పరిపాలన రాజధానిగా కాబోతున్న నేపథ్యంలో వైజాగ్.. అంటే ఓ బ్రాండ్ ఇమేజ్ అన్నట్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్రెండ్ సెట్ చేశారు. మూడు నెలల వ్యవధిలో నాలుగు అంతర్జాతీయ సదస్సులకు వేదికగా నిలిచి... ప్రతి సదస్సును విజయవంతంగా నిర్వహించిన విశాఖ నగరం.. దేశ విదేశీ ప్రతినిధుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంది. ఐటీ సదస్సులతో టెక్నాలజీ ఐకాన్ సిటీగా పేరొందిన నగరం.. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ విజయవంతంగా నిర్వహించిన తర్వాత పెట్టుబడులకు స్వర్గధామంగా మారగా.. నాలుగు రోజుల పాటు నిర్వహించిన జీ–20 సదస్సుతో అందరి నోటా ఒకే మాట.. దేశానికి ఆర్థిక కోట.. విశాఖ.. అనే ఇంటర్నేషనల్ బ్రాండ్‌ను సొంతం చేసుకుంది. నాలుగు రోజుల పాటు ఆతిథ్యమిచ్చిన వైజాగ్.. మంచి జ్ఞాపకాల్ని అందించిందంటూ విదేశీ ప్రతినిధులు చెబుతుండటం విశేషం.

అభివృద్ధి చెందుతున్న ద్వితీయ శ్రేణి నగరాల్లో అగ్రభాగంలో ఉన్న విశాఖపట్నంలో ఏ సదస్సు నిర్వహించినా.. సూపర్ సక్సెస్ అవుతుందన్నది మరోసారి నిరూపితమైంది. ప్రణాళికా బద్ధంగా నిర్మితమైన నగరంగా విశాఖకు జీ20 సదస్సు నిర్వహణతో అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు పెట్టుబడుల సదస్సులు నిర్వహించినా.. కానరాని ఇమేజ్.. ఈ ఏడాది నిర్వహించిన సదస్సులతోనే సొంతం చేసుకుంది. జీఐఎస్‌తో వైజాగ్ పేరు ఖండాంతరాలు దాటగా జీ20తో విశ్వవ్యాప్తమైంది. ఈ ఏడాది తొలినాళ్లలో రాష్ట్ర ప్రభుత్వం, ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ(ఐటాప్) ఆధ్వర్యంలో 'ఇన్ఫినిటీ వైజాగ్' సదస్సు నిర్వహించారు. అనంతరం గ్లోబల్ టెక్ సమ్మిట్ జరిగింది. ఈ రెండు సదస్సులకు 40కి పైగా దేశాలకు చెందిన విదేశీ ప్రతినిధులు హాజరై వైజాగ్



సిటీ వైభవాన్ని చూసి ముగ్ధులయ్యారు. వైజాగ్.. ఐటీ రంగానికి డెస్టినేషన్ అని కొనియాడారు.

జీఐఎస్‌తో కొత్త ఇమేజ్..

రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించిన తర్వాత నగరానికి సరికొత్త ఇమేజ్ వచ్చింది. విశాఖపట్నం సమగ్రాభివృద్ధి చేసేందుకు ఎంతో అవకాశం ఉన్న నేపథ్యంలో ఎవరు వచ్చినా ఆహ్వానించదగ్గ ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న నగరంలో తమ వ్యాపార కార్యకలాపాలు విస్తరించాలన్న ఆలోచనలు పారిశ్రామికవేత్తలు స్వయంగా చూసిన తర్వాత రూఢీ చేసుకున్నారు. నివాస యోగ నగరాల్లో టైర్–1 సిటీలతో పోటీ పడుతున్న విశాఖపట్నం పెట్టుబడులకు కూడా ప్రధాన కేంద్రంగా మారింది. అంతర్జాతీయ సంస్థలు కూడా విశాఖ జిల్లాలో తమ కార్యకలాపాలు విస్తరించేందుకు ముందుకొచ్చాయంటే దీనికి కారణం.. వైజాగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అన్నది జగమెరిగిన సత్యం.

జీ–20తో అంతర్జాతీయ ఖ్యాతి

భిన్న వాతావరణం, విభిన్న సంస్కృతులు, మెచ్చే భాషలు, ఆది నుంచి దూసుకుపోతున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు వెరసి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విశాఖపట్నం వైపు చూసేలా చేస్తున్నాయి. జీఐఎస్ విజయవంతం అనంతరం నాలుగు రోజుల పాటు జరిగిన జీ20 సదస్సు అద్భుతంగా జరిగింది. నగరాల అభివృద్ధి, ఆర్థిక పురోగతి, నిధుల సమీకరణ తదితర అంశాలపై సెషన్లు నిర్వహించారు. అనంతరం నగర పర్యటనలో భాగంగా జీ20 దేశాల ప్రతినిధులు నగర సందర్శన చేశారు.

నగర అభివృద్ధికి చిహ్నంగా వినూత్నంగా ప్రాజెక్టులు నిర్వహించడాన్ని విదేశీ ప్రతినిధులు ప్రశంసించారు. మార్చి 28న సదస్సు ప్రారంభం రోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై.. విదేశీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. విశాఖ నుంచి వెళ్లేటప్పుడు మధురమైన జ్ఞాపకాల్ని తీసుకెళ్తారని సీఎం వైఎస్ జగన్ చెప్పినట్లుగా.. జీ20 సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ.. అదే ఫీలింగ్‌తో బయలుదేరారు. సదస్సు విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించిన జిల్లా అధికారయంత్రాంగం, పోలీసులకు కలెక్టర్ డా.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

అందరికీ ఆధార్ కార్డు



ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశం

తుమ్మపాల: అందరికీ ఆధార్ కార్డు ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ప్రతి ఒక్కరూ కార్డు కలిగి ఉండాలన్నారు. ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో ఆధార్ నమోదు నిర్వహించాలన్నారు. ఐదు సంవత్సరాలు పైబడిన వారికి బయోమెట్రిక్ ద్వారా జిల్లా విద్యా శాఖ సమన్వయంతో సేవలు అందించాలని జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి మంజులావాణిని ఆదేశించారు. ఆధార్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గిరిధర్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ ఉషారాణి, లీడ్‌బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నపరిశ్రమలకు ఎఫ్ఎఫ్ కాంప్లెక్స్‌లు

జిల్లాలో ఏర్పాటు చేయనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ చిన్న పరిశ్రమలకు వరమని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో పరిశ్రమలు, ఎగుమతుల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడూరు ఇండస్ట్రియల్ పార్కులో ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలం గుర్తించాలని అనకాపల్లి ఆర్డీవోను ఆదేశించారు. బహుళ అంతస్తుల కాంప్లెక్స్‌లో చిన్న పరిశ్రమల స్థాపనకు స్థలాలను కేటాయిస్తామన్నారు. కంపెనీలకు సరఫరా చేస్తున్న నీటినాణ్యతపై జీవీఎంసీ జలవిభాగం ఇంజినీర్లు తనిఖీలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమయ్యే అన్ని చర్యలను వేగవంతం చేయాలన్నారు. డీఆర్వో పి.వెంకటరమణ, ఏపీఐఐసీ జెడ్ఎం త్రినాథ్, డీఐసీ జనరల్ మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

చంద్రబాబు, రామోజీ తోడు దొంగలు

- ఇద్దరూ ప్రజాధనాన్ని లూటీ చేశారు
- కేసుల్లో ఇరుక్కున్నపుడే దళితులు గుర్తొస్తారు
- మంత్రి మేరుగ నాగార్జున విమర్శలు

నక్కపల్లి: చంద్రబాబునాయుడు, రామోజీరావులు తోడు దొంగలని, ఇద్దరికీ కేసుల్లో ఇరుక్కున్నప్పుడే దళితులు గుర్తొస్తారని, వారిని అడ్డంపెట్టుకుని రాజకీయం చేసి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తుంటారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆరోపించారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాల్సిన రూ.375 కోట్ల ప్రభుత్వ ధనాన్ని చంద్రబాబునాయుడు తన ఖాతాల్లోకి జమ చేసుకున్నారన్నారు. ఇక చంద్రబాబు మార్గదర్శి చీటీల పేరుతో వందల కోట్ల ప్రజాధనాన్ని తన వ్యక్తిగత, ఇతర వ్యాపార సంస్థల ఖాతాల్లోకి వేసుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఇద్దరి అవినీతి బాగోతం ఇటీవల దర్యాప్తు సంస్థల విచారణలో వెల్లడయిందన్నారు. మార్గదర్శి వ్యవహారాన్ని, స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి బాగోతం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు చంద్రబాబు, రామోజీలు కలిసి రాష్ట్రంలో దళితులపై హత్యలు పెరిగిపోతున్నాయంటూ రాద్ధాంతం ప్రారంభించారన్నారు. కాల్‌మనీ కేసుల్లో టీడీపీ ఎమ్మెల్యేలు ఇరుక్కుపోతే దానిపై అసెంబ్లీలో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ సభ్యులు చర్చకు పట్టుబట్టారని.. అంబేడ్కర్ అంశాన్ని తీసుకువచ్చి కాల్‌మనీ అంశం చర్చకు రాకుండా పక్కదారి పట్టించారని మండిపడ్డారు. జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో మౌలిక సదుపాయాల కల్పన

- పార్లమెంట్ నియోజకవర్గంలో రూ.5 కోట్లతో అభివృద్ధి
- ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి



విలేకర్లతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : వర్క్ ఫ్రం హోంలో గ్రామీణ యువత విధులు నిర్వహించుకునేలా అన్నిరకాల మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడాది ఎంపీ నిధుల నుంచి రూ.5 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామాల్లో తాగు నీరు, సోలార్ విద్యుత్‌తోపాటు మరింత ఆధునిక సాంకేతికను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. కశింకోట మండలంలో 13 గ్రామ పంచాయతీలకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా నూతన మంచినీటి బోర్ల ఏర్పాటుకు రూ.13 లక్షలు మంజూరు చేశామన్నారు.

చూచుకొండ, హరిపాలెం, తుమ్మపాల గ్రామాల్లో శ్మశాన వాటికల ప్రహరీల నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించినట్టు పేర్కొన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పొందూరు, కోటవురట్ల, కైలాసపట్నం, యలమంచిలి, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లో సోలార్ వీధి దీపాల ఏర్పాటుకు రూ.50 లక్షలు మంజూరు చేసినట్టు వెల్లడించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 100 అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి, ప్రీస్కూల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో చిన్నారులు ఆడుకునేందుకు క్రీడా పరికరాలు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.

శారదాకాలనీ, తుమ్మపాల గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేశామన్నారు. సత్యనారాయణపురం పంచాయతీ దేవీనగర్‌లో 2 బ్రిడ్జిల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఎన్టీఆర్ క్రీడామైదానం గ్యాలరీ వెనుక స్థలంలో రూ.70 లక్షలతో క్రీడాకారులకు విశ్రాంతి భవనం, వ్యాయామశాల ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



కొక్కిరాపల్లిలో టెన్త్ విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి



నక్కపల్లి గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

- పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం
- విద్యాసంవత్సరానికి ముందే అవసరాల గుర్తింపు
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

నక్కపల్లి/యలమంచిలి: విద్యాసంవత్సరానికి ముందే విద్యార్థుల అవసరాలు గుర్తించి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను, యలమంచిలి పట్టణానికి సమీపంలో ఉన్న కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఆహార మెను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ భావితరాల కోసం ముఖ్యమంత్రి విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు పథకాన్ని ప్రవేశ పెట్టి కోట్లాది రూపాయల వ్యయంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. 3వ తరగతి నుంచే ఇంగ్లిషు మీడియంను ప్రవేశపెట్టామన్నారు. జగనన్న విద్యాకానుక, అమ్మఒడి, విద్యావసతి వంటి సదుపాయాలను ఉపయోగించుకుని పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. నక్కపల్లి గురుకుల పాఠశాలలో ఒక విద్యార్థి ఇక్కడ సదుపాయాలు వివరిస్తూ.. ఈ బడి నా సొంత ఇల్లులాంటిదని, టీచర్ నాకు రెండో అమ్మలాంటిదని చెప్పడం ఎంతో ఆనందమనిపించిందన్నారు. ఇక్కడ పిల్లలు అనర్గళంగా ఇంగ్లిషులో మాట్లాడుతూంటే ఆశ్చర్యమేసిందన్నారు. పదో తరగతి పరీక్షల్లో చక్కటి ఫలితాలు సాధించాలని సూచించారు. కొక్కిరాపల్లి విద్యార్థులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై నృత్య ప్రదర్శన చేశారు. 10వ తరగతి విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు, రైటింగ్ ప్యాడ్, పెన్నులు వంటి పరీక్ష సామగ్రిని అందజేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కొక్కిరాపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణతార, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, నక్కపల్లి ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్డీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ స్థలాలను అభివృద్ధి చేస్తాం

ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉన్న స్థలాలను అభివృద్ధి చేస్తామని మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. శుక్రవారం ఆయన నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న సుమారు 4 ఎకరాల కార్పొరేషన్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమ్యూనిటీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, మాల్స్, చిన్నతరహా పరిశ్రమలు నిర్మించి దళితులకు ఉపాధి కల్పిస్తామన్నారు.

రోడ్డు విస్తరణకు వీడిన గ్రహణం

ప్రభుత్వం చొరవతో దశాబ్దాల నాటి ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణకు మోక్షం లభించింది. నర్సీపట్నం నుంచి కేడీ పేట వెళ్లే ప్రధాన రోడ్డు అటవీ ప్రాంతంలో ఉండటం వల్ల కొన్ని దశాబ్దాలుగా విస్తరణకు నోచుకోలేదు. అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ రోడ్డు విస్తరణ అంశాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అటవీశాఖకు ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులను మంజూరు చేయించారు. దీంతో రాజులబాబు ఆలయం నుంచి పప్పుశెట్టిపాలెం జీడిమామిడి తోటల వరకు చేపట్టాల్సిన రోడ్డు విస్తరణకు గ్రహణం వీడింది. రూ.5 కోట్లతో ప్రస్తుతం ఉన్న 12 అడుగుల రోడ్డును 24 అడుగులకు విస్తరించేందుకు అర్‌అండ్‌బీ అధికారులు సిద్ధమవుతున్నారు.

- సీఎం ఆదేశాలతో అటవీ శాఖ గ్రీన్‌సిగ్నల్
- ఆరిలోవ రహదారికి మహర్దశ
- రూ.5 కోట్లతో పనులు చేపట్టేందుకు అర్‌అండ్‌బీ సమాయత్తం
- ఆర్భాట ప్రకటనలతో సరిపెట్టిన అయ్యన్న పాత్రుడు



విస్తరించనున్న ఆరిలోవ అటవీ ప్రాంతంలో ప్రధాన రోడ్డు

నర్సీపట్నం: ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ చేస్తామని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఆర్‌అండ్‌బీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆర్భాటంగా చేసిన ప్రకటన కార్యరూపం దాల్చలేదు. ఎన్నో ఏళ్లుగా ఆ సమస్య అలాగే ఉండిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మబ్బులు వీడి సమస్యకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ రోడ్డు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించారు. నర్సీపట్నం– కేడీపేట రోడ్డు విస్తరణ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి 11 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరించేందుకు రెండేళ్ల కిందట రూ.11 కోట్లు తీసుకువచ్చారు. అటవీ క్లియరెన్స్ రావటం ఆలస్యమవడంతో ఆరిలోవ అటవీ ప్రాంతంలో మూడు కిలోమీటర్ల 456 అడుగుల రోడ్డును వదిలేసి, రూ.6 కోట్లతో ఆరున్నర కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరించారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వంతో మాట్లాడి అటవీ క్లియరెన్స్ తీసుకువచ్చారు. రోడ్డు విస్తరణలో కోల్పోతున్న అటవీ భూమికి బదులుగా గొలుగొండ మండలం పాకలపాడు వద్ద ఐదెకరాల ప్రభుత్వ భూమిని అటవీశాఖకు అప్పగించారు. ఇందులో అటవీ వనాల అభివృద్ధికి ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.45.80 లక్షలు అటవీశాఖకు జమ చేయకపోవడంతో రోడ్డు విస్తరణకు ఆటంకం ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ శాఖ వద్ద రోడ్డు విస్తరణకు నిధులున్నా, ప్రభుత్వం అటవీ శాఖకు నిధులు చెల్లింపులో జాప్యం ఏర్పడింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ వల్ల అనకాపల్లి, కాకినాడ, అల్లూరి జిల్లాల నుంచి రాకపోకలు సాగించే ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.

సీఎంకు రుణపడి ఉంటాం...



గత పాలకులు చేయలేని రోడ్డు విస్తరణ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నెరవేరుతుండడం చాలా సంతోషంగా ఉంది. నియోజకవర్గ ప్రజల తరఫున సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. అడిగిన వెంటనే సీఎం అక్కడక్కడే నిధులు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని రోడ్డు విస్తరణకు సంకల్పించాను. వచ్చే నెల మొదటి వారంలో పనులు ప్రారంభమవుతాయి.

– పెట్ల ఉమాశంకర్ గణేష్, ఎమ్మెల్యే, నర్సీపట్నం

గిరిజన సెల్ బలోపేతానికి చర్యలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి రజిని

విశాఖపట్నం: కేజీహెచ్ గిరిజన సెల్ బలోపేతం చేసి రోగులకు మెరుగైన సేవలు అందించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని ఆదేశించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి గిరిజన సెల్‌కు సంబంధించి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజని మాట్లాడుతూ పాడేరు, అరుకులో కొత్తగా బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ గిరిజనసెల్‌కు ఖరీదైన మందులు, కాంట్రాస్ట్ స్కాన్ చేయడానికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. అరుదైన రక్త నమూనాలకు సంబంధించిన సమస్యలను మంత్రికి వివరించారు. కాన్ఫరెన్స్‌లో కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంటల నష్టం నమోదు వేగవంతం

తుమ్మపాల: అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని వేగంగా నమోదు చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్ కింద ప్రతి మండలంలో ఒక రైతు భరోసా కేంద్రంలో ప్లాంట్ హెల్త్ డయాగ్నొస్టిక్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. చేపల రవాణాకు పీఎంఎంఎస్‌వై పథకంలో వాహనాలను 40 శాతం సబ్సిడీతో సరఫరా చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. డ్రిప్ ఇరిగేషన్ (తుంపర సేద్యం) పరికరాలను సరఫరా చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, మత్స్య శాఖ అధికారి లక్ష్మణరావు, వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

త్వరగా ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారం

ప్రతి నెల రెండు రోజులలో పౌరహక్కుల దినోత్సవాలను జరపాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. కలెక్టరేట్‌లో జరిగిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కేసులను వీలైనంత వరకు త్వరగా పరిష్కరించాలని, సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎస్పీ గౌతమి సాలి, డీఆర్వో పి.వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆ గ్రామానికి ఏమైంది?

కిండలం.. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే ఆ గ్రామంలో సంభవించిన వరుస మరణాలు గ్రామస్తులను ఆందోళనకు గురి చేశాయి. సహజ మరణాలే అయినప్పటికీ పదిరోజుల వ్యవధిలో ఏడుగురు మృతి చెందడంతో భయంతో గడుపుతున్నారు. చాలా మంది పక్క గ్రామాలకు బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. గ్రామంలో ఎవరు చనిపోయినా దహన సంస్కారాలకు వెళ్లడం లేదు సరికదా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సహజ మరణాలు కావడం వల్ల ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గ్రామాన్ని సందర్శించిన వైద్య బృందాలు, జిల్లా అధికారులు వారికి ధైర్యం చెప్పారు.

- కిండలంలో 10 రోజుల వ్యవధిలో ఏడుగురు మృతి
- వరుస మరణాలతో పక్క గ్రామాలకు వెళ్లిపోతున్న గ్రామస్తులు
- భయం భయంతో బిక్కు బిక్కుమంటున్న గిరిజనులు
- రోజు వారి వైద్య శిబిరాల ఏర్పాటు
- మూఢ నమ్మకాలు విడనాడాలని వైద్య బృందాల సూచన


వరుస మరణాలు సంభవించిన కిండలం గ్రామం


ఆందోళన చెందుతున్న కిండలం గ్రామస్తులు

పెదబయలు: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల కుంతుర్ల పంచాయతీ కిండలం గ్రామంలో అంతుచిక్కని వ్యాధి వల్ల వరుస మరణాలతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 350 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో ఈ నెల 18నుంచి వరుస మరణాలు సంభవించాయి. తొలుత అదేరోజు కిముడు చిన్నమ్మి (65) సాధారణ జ్వరంతో మృతి చెందింది.

- ఈ నెల 19న కిముడు లక్ష్మీనారాయణ, సత్యవతి దంపతులకు చెందిన తొమ్మిది నెలల పసికందు చనిపోయింది.
- ఈ నెల 22న కిముడు బోడంనాయుడు(45) చింతచెట్టు పైనుంచి జారిపడిన వెంటనే పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం పొందుతూ మృతి చెందాడు.
- ఈ నెల 25న కిముడు కృష్ణంనాయుడు (41) రక్తపు వాంతులు చేసుకోవడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించే క్రమంలో మార్గంమధ్యలో మృతి చెందాడు.
- ఈ నెల 26న కిముడు రాంనాయుడు(58) విచిత్రంగా ప్రవర్తిస్తూ తనకు ఏదో కనిపిస్తుందని భయపడుతూ ఆందోళన చెంది గ్రామంలో మృతి చెందాడు.
- ఇదే లక్షణాలతో ఈ నెల 27న వంచరంగి రామన్నదొర(42), ఈ నెల 29న కునెబేరి ఈశ్వరమ్మ(35) మృతి చెందారు. 10 రోజుల వ్యవధిలో ఏడుగురు ఒకే గ్రామానికి చెందిన వారు మృతి చెందడంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు.

మృతుల ఇళ్లకు రావడానికి జంకుతున్న వైనం..

గ్రామంలో మృతి చెందిన వారి ఇళ్లకు వెళ్లడానికి, దహన సంస్కార కార్యక్రమాలకు గ్రామస్తులు, చుట్టుపక్కల వారు, బంధువులు రావడానికి జంకుతున్నారు. దీంతో కొద్దిమంది మాత్రమే దహన సంస్కార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

- గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 31 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు రోజుల నుంచి ఉపాధ్యాయుడు వస్తున్నా, విద్యార్థులను పంపించడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. 56 మంది చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించడం లేదు. ప్రభుత్వ అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించాలని యువకులు కోరుతున్నారు.
- గ్రామంలో నాలుగు రోజుల నుంచి వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఎవరిలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించడం లేదని వారు చెబుతున్నారు.

భయంతో గడుపుతున్నాం



వారం రోజుల నుంచి భయంతో గడుపుతున్నాం. రాత్రి పూట నిద్ర పట్టడం లేదు. ఆరోగ్యంగా ఉండిన వారు ఒక్క రోజులోనే మృతి చెందడం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా మరణాలు ఆగలేదు. దీంతో చాలా మంది పక్క గ్రామాలకు బంధువుల ఇళ్లకు పిల్లలు, మహిళలు వెళ్లిపోయారు. అధికారులు గ్రామస్తుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి సాధారణ స్థాయికి తేవాలి.

– కిముడు చిన్నంనాయుడు, యువకుడు, కిండలం

చనిపోయినా రావడం లేదు



గ్రామంలో వరుస మరణాలతో గ్రామానికి ఏదో గాలి ఆవహించిదని ప్రచారం జరుగుతోంది. దాంతో గ్రామస్తుల్లో ఎవరూ చనిపోయినా దహన సంస్కార కార్యక్రమాలకు రావడం లేదు. వారు కుటుంబీకులు మాత్రమే వెళ్లడం బాధగా ఉంది.

– వంచరంగి కోటిబాబు, గ్రామస్తుడు, కిండలం

అన్నీ సహజ మరణాలే..

- ఎక్కువ మందిలో హైపర్ టెన్షన్
- కేజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్నాథం
- గ్రామాన్ని సందర్శించిన వైద్య బృందాలు
- 53 మంది నుంచి రక్తనమూనాల సేకరణ

పెదబయలు: మండలంలోని కుంతుర్ల పంచాయతీ కిండలం గ్రామంలో ఇప్పటి వరకు సంభవించిన మరణాలు సహజ మరణాలేనని కేజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్నాథం, కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సింధూర వెల్లడించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్, కలెక్టర్ ఆదేశాల మేరకు కిండలం గ్రామంలో కేజీహెచ్, జిల్లా ఆస్పత్రి వైద్య బృందాలు సంయుక్తంగా వైద్య శిబిరం ఏర్పాటుచేసినట్టు వారు వివరించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పరిశీలించామని, మహిళలు, వృద్ధులు, గర్భిణులు, యువకుల నుంచి 53 రక్త నమూనాలను సేకరించినట్టు చెప్పారు. యువకులకు కూడ హైపర్ టెన్షన్ (బీపీ) ఎక్కువగా ఉందని వెల్లడించారు. ఆహార అలవాట్లు, ఎక్కువగా ఉప్పు తినడం, నీరు ఎక్కువగా తాగకపోవడం, ఇతర చెడు అలవాట్ల వల్ల హైపర్ టెన్సన్ వచ్చే అవకాశం ఉందన్నారు. దీన్ని వల్ల గుండెనొప్పితో మృతి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. సేకరించిన రక్త నమూనాలను పరీక్షించిన తరువాత దాని ప్రకారం వైద్యసేవలు అందిస్తామన్నారు. గ్రామంలో వైద్య సిబ్బంది వద్దకు కొద్దిమంది మాత్రమే వస్తున్నారన్నారు. గత మూడు నెలల నుంచి ప్రతీ నెల నాల్గవ సోమవారం కిండలం గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరంలో గర్భిణులు మాత్రమే వచ్చి పరీక్షలు చేసుకుంటున్నారన్నారు. మిగిలిన వారు రావడానికి ఇష్టపడడం లేదన్నారు. వివిధ కారణాల వల్ల ఏడు మరణాలు చోటుచేసుకోవడంతో గ్రామస్తుల్లో భయం నెలకొందన్నారు. ఏదో జరుగుతుందని ఆందోళన తప్ప ఎటువంటి వ్యాధుల ప్రభావం లేదన్నారు. పరిస్థితి సాధారణ స్థాయికి వచ్చేంత వరకు ప్రతీ రోజు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. భయంతో ఇతర గ్రామాలకు వెళ్లిన వారు తిరిగి గ్రామానికి వచ్చేలా అవగాహన కల్పిస్తామన్నారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో తాగునీరు, శానిటేషన్ బాగుందని అలాగే నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపిస్తామని తెలిపారు. పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పి.శంకర్ ప్రసాద్, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సింధూరం పడాల్, రమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కిండలం గ్రామాన్ని సందర్శించిన కేజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్నాథం తదితరులు


రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య బృందం

విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులదే

- విద్యాశాఖ డైరెక్టర్ ప్రసన్నకుమార్

నక్కపల్లి: విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉందని విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ (లైబ్రరీస్) ఎంఆర్ ప్రసన్నకుమార్, మిడ్‌డే మీల్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలో చినరామభద్రపురంలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాయి రమేష్‌బాబు స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన సందర్భంగా శుక్రవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన పౌరసన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. రమేష్‌బాబు ఉపాధ్యాయ వృత్తితో పాటు, సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకు వస్తూ న్యాయమైన పరిష్కారం కోసం తపన పడేవారన్నారు. స్వచ్ఛందంగా పదవీ విరమణ చేస్తున్న రమేష్‌బాబును అభినందించడానికి నియోజకవర్గం నలుమూలల నుంచి ఆయన అభిమానులు, సహచర ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు వచ్చారంటే ఆయన వ్యక్తిత్వం ఎటువంటిదో తెలుసుకోవచ్చన్నారు. యూనియన్లను సమన్వయం చేస్తూ ఉపాధ్యాయ సమస్యలపై తమదైన శైలిలో పరిష్కారానికి కృషి చేసేవారని ఉపాధ్యాయ సంఘ నేతలు గోపీనాథ్, నూకరాజు, వెంకటరావు, చలపతిరావు తదితరులు కొనియాడారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛంద పదవీ విరమణ అనంతరం రమేష్‌బాబు ఎంచుకున్న రంగంలో ఆశించిన స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సన్మానగ్రహీత రమేష్‌బాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన ఉన్నతాధికారులు, సహచర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో మహాలక్ష్మమ్మ, ఎంపీపీలు ఏనుగుపల్లి రత్నం, ఇసరపు పార్వతి తాతారావు, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవోలు డీవీడీ ప్రసాద్, గాంధీ, సర్పంచ్‌లు గారా ఉషశ్రీప్రసాద్, రాఘవకుమారి, దండు బలరామరాజు, దేవర సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, జి. నర్సింహమూర్తి, సఖిరెడ్డి రమణ, వెంకట్రావు, వి. చంటి తదితరులు పాల్గొన్నారు.


రమేష్‌బాబు దంపతులను సన్మానిస్తున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు, గ్రామస్తులు

అత్తకు సేవలు చేయలేక కోడలు ఆత్మహత్య


గంగాభవాని

పాయకరావుపేట : పట్టణంలోని ముస్లిం వీధికి చెందిన మహిళ అత్తకు సేవలు చేయలేక పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్‌ఐ జె.గోవిందరావు తెలిపారు. వివరాలు.. ముస్లిం వీధికి చెందిన ఎం.గంగాభవాని(52) అత్త వెంకటలక్ష్మికి పదేళ్ల క్రితం గుండె ఆపరేషన్ చేయించుకుంది. నాలుగు రోజుల నుంచి అత్తకు అనారోగ్యం తిరగబెట్టింది. దీంతో సేవలు చేయలేక మనస్థాపానికి గురైన గంగాభవాని గురువారం రాత్రి గడ్డిమందు తాగేసింది. చికిత్స కోసం తుని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఆమె మరణించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతురాలి కుమారుడు ఎం.బుల్లిస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

శిశుగృహలో విజిలెన్స్ తనిఖీలు



ఫైళ్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అదనపు ఎస్పీ స్వరూపారాణి

విశాఖ : ఆర్అండ్‌బి జంక్షన్ దరి ఉన్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ శిశుగృహలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ జి.స్వరూపారాణి నేతృత్వంలో శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. శిశుగృహలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. సిబ్బంది హాజరు పట్టికతో పాటు దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో ఆరు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా వృద్ధాశ్రమం, ప్రేమసమాజం, పాపా హోమ్, కేజీహెచ్ అడిక్షన్ సెంటర్, మెంటల్ కేర్ హాస్పిటల్, పెదవాల్తేరు రెడ్ క్రాస్ సొసైటీలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రేవతి, ఏఈ రామ్‌గోపాల్, సీనియర్ అసిస్టెంట్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రపాలెంలో మూడు బైక్‌ల దగ్ధం

- నిప్పుపెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

కొయ్యూరు: గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత రాజేంద్రపాలెం రామకృష్ణ మెకానిక్ షాపు బయట ఉంచిన మూడు బైక్‌లకు నిప్పు పెట్టారు. రెండు రోజుల కిందట మూడు బైక్‌లను రిపేర్ చేయాలని మెకానిక్ రామకృష్ణకు ఇచ్చారు. ఆయన వాటిని రిపేర్ చేసేందుకు షాపు బయట ఉంచారు. ఇంతలో వాటిని తగులబెట్టారు. అవి కాలిపోతున్న విషయాన్ని స్థానికులు షాపు యజమానికి చెప్పడంతో వెంటనే ఆయన వచ్చిన మంటలార్పారు. వెంటనే అప్రమత్తం కావడంతో షాపు లోపల మరో నాలుగు బైక్‌లకు మంటలంటుకోలేదు. కాలిపోయిన బైక్‌ల విలువ రూ.లక్ష దాటి ఉంటుందని బాధితుడు చెబుతున్నాడు. కొయ్యూరు ఎస్‌ఐ రాజారావు శుక్రవారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులపై కోపంతో వాటిని తగులబెట్టారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. వర్తక సంఘం నేత చక్రరావు కాలిపోయిన బైక్‌లను పరిశీలించి బాధితుడిని ప్రజాప్రతినిధులు ఆదుకోవాలని కోరారు. ఇటీవల బాధితుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.


కాలిపోయిన బైక్‌లతో మెకానిక్ రామకృష్ణ

గుండెపోటుతో కార్మికుడి మృతి

- పరిహారం కోసం ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీలోని యుజియా స్టెరైల్స్ పరిశ్రమలో విధి నిర్వహణలో ఉన్న కార్మికుడు శుక్రవారం ఉదయం గుండె నొప్పి రావడంతో కుప్పకూలి పోయాడు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు అందించిన వివరాలు.. ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలేనికి చెందిన ఉమ్మిడి వెంకటేష్ (32) యుజియా స్టెరైల్స్ పరిశ్రమలో పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం పరిశ్రమ వద్దకు వచ్చాడు. ఇంతలో ఆరోగ్యం బాగా లేదని క్యాంటీన్‌లో కాసేపు కూర్చుని ఉండగా తోటి కార్మికులు వెంకటేష్‌కు సపర్యలు చేశారు. అనంతరం విధులకు వెళుతుండగా ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. వెంటనే అంబులెన్స్‌లో వన్‌ప్లస్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకటేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య, 4, 6 సంవత్సరాల వయసున్న ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వెంకటేష్ మృతదేహాన్ని షీలానగర్ కిమ్స్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.



షీలానగర్ కిమ్స్ ఐకాన్ వద్ద రోదిస్తున్న మృతుని భార్య, బంధువులు (ఇన్‌సెట్) మృతుడు వెంకటేష్ (ఫైల్)

రూ.కోటి చెల్లించాలి

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుడు వెంకటేష్ కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

మృతుడి బంధువుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం: మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, గ్రామస్తులు హాస్పిటల్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. నష్టపరిహారంతో పాటు మృతుని భార్యకు కంపెనీలో ఉద్యోగం కల్పించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఆస్పత్రి వద్దకు కంపెనీ ప్రతినిధులు చేరుకొని కుటుంబ సభ్యులతో రాత్రి వరకు చర్చలు జరుపుతున్నారు. ఎటువంటి ఆందోళనకర సంఘటనలు జరగకుండా గాజువాక ఎస్‌ఐ కొల్లి సతీష్, పరవాడ ఎస్‌ఐ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది రక్షణ చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

మండల సమావేశం నేడు

కశింకోట : మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా జేజిబాబు



విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా కోటిపల్లి జేజిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గవరపాలెం కామాక్షిదేవి ఆలయంలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారిగా పొన్నాడ వెంకటసత్య నరసింహాచారి, గౌరవాధ్యక్షులుగా మత్సుర్తి గంగారావు, కోసూరి మన్మధరావు, కాకినాడ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కోటిపల్లి శ్రీనివాసరావు, తణుకు రవికుమార్, ఎస్.సతీష్‌కుమార్, ఎస్.నాగు, మరో 10మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ రెండేళ్ల మనుగడలో ఉంటుందని గోవిందరాజు తెలిపారు.

మేధాశక్తికి ఆయుర్వేద లేహ్యం



ఆయుర్వేద మందులు అందిస్తున్న లావణ్య

అనకాపల్లిటౌన్ : ప్రకృతి ప్రసాదించిన ఆయుర్వేద వైద్యంతో రోగాలను దూరం చేసుకోవచ్చని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి లావణ్య అన్నారు. స్థానిక జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆయుర్వేద లేహ్యం విద్యార్థుల మేధస్సుకు దోహదపడుతుందన్నారు. ఈ లేహ్యం ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో అందుబాటులో ఉందన్నారు. అంతకుముందు విద్యార్థులకు ఆయర్వేద మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారుల్లేని సివిల్ రైట్స్ డే

అనకాపల్లిటౌన్ : పౌరహక్కుల దినోత్సవంలో సంబంధిత అధికారులు కనిపించలేదని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ సభ్యులు ఎం.అప్పలరాజు, రేబాక మధుబాబులు ఆరోపించారు. మండలంలోని కూండ్రం వసతిగృహంలో శుక్రవారం జరిగిన సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, పట్టణ సీఐ, ఇతర మండల స్థాయి అధికారులెవరూ హాజరుకాలేదు. కేవలం వీఆర్వో, వసతిగృహ వార్డెన్‌తో తూతూ మంత్రంగా నిర్వహించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టి	సత్యనారాయణస్క్రీన్-1
జాన్‌విక్ (చాప్టర్-4)	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 114 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, ఏ నెగిటివ్ -1 యూనిట్, బీ పాజిటివ్-42 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-58 యూని ట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 453 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 327 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

పాడి.. సంరక్షణతో రాబడి

- వేసవిలో పశు సంరక్షణపై అప్రమత్తత
- వడదెబ్బ నుంచి రక్షణ చర్యలు తప్పనిసరి
- నిర్లక్ష్యం వహిస్తే మృత్యువాత – పశువైద్యాధికారులు

అనకాపల్లి రూరల్ : వేసవిలో ఎండల తీవ్రత నుంచి పశువులను కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు తప్పనిసరి. మండుటెండలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉష్ణతాపంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. ఆ సమయంలో సరైన రక్షణ చర్యలు చేపట్టకపోతే ఎండ తీవ్రత వలన పశువులకు వడదెబ్బ తగిలే అవకాశముంది. తద్వారా పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడమే కాకుండా, పశువులు మృత్యువాత పడే ప్రమాదం ఉంది.

యాజమాన్య పద్ధతులు ఇలా..

సాధారణంగా వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వలన పాడి పశువులు ఒత్తిడికి, అసౌకర్యానికి లోనవుతాయి. దీంతో మేత తీసుకోవడం తగ్గిపోతుంది. తద్వారా పాల దిగుబడి, పాలలో వెన్న శాతం తగ్గిపోతుందని పశువైద్యాధికారులు చెప్తున్నారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు పశువుల సంరక్షణకు పాటించే రోజువారీ యాజమాన్య పద్ధతుల్ని సూచిస్తున్నారు.

- గాలీ వెలుతురు బాగా ప్రవేశించేలా పశువులకు ప్రత్యేక కొట్టం, షెడ్డు, తాటి కమ్మల పాక ఏర్పాటు చేసుకోవాలి.
- షీట్లు వేసిన షెడ్డుపై 8–10 సెం.మీ. మందంతో ఎండు గడ్డిని పరిచి రోజుకు రెండు మూడుసార్లు నీటితో తడపాలి.



మేత మేస్తున్న పశువులు

- షెడ్డుకు ఇరువైపులా గోనె సంచులను కట్టి నీటితో తడపడం ద్వారా షెడ్డు లోపల ఉష్ణోగ్రతతో పాటు వేడి గాలుల తీవ్రతను తగ్గించవచ్చు. వీలైతే నీటి స్ప్రింక్లర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవచ్చు.
- పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా, పరిశుభ్రమైన నీటిని అందించాలి.
- పచ్చ గడ్డి, ఎండు గడ్డి సమృద్ధిగా అందించాలి.
- పశువులపాక, షెడ్డు లేదా కొట్టం చుట్టూ అవిసె, మునగ తదితర నీడనిచ్చే చెట్లను పెంచడం వలన అవి పశుగ్రాసంగా కూడా ఉపయోగపడతాయి.
- ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో పశువులను బయటకు తీసుకెళ్లరాదు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు తీసుకెళ్లాలి.
- పశువులు వేసవిలో ఎక్కువ నీటిని తాగడం వలన మేత తక్కువగా తీసుకుంటాయి. అందుచేత పోషక విలువలు ఎక్కువగా ఉన్న మేతను అందించాలి.
- ఉదయం పచ్చి మేతను, సాయంత్రం ఎండు మేతను అందించాలి. చాప్ కట్టర్‌ను వాడటం వలన మేత వృథాను అరికట్టవచ్చు.
- పచ్చిమేత అందుబాటులో లేనపుడు సైలేజ్,



పాకలో కట్టిన పశువులు

టీఎంఆర్, అజొల్లాను వాడవచ్చు.

- మినరల్ మిక్సర్, ఉప్పును దాణాలో కలిపి పెట్టుకోవాలి.
- చూడికి సిద్ధంగా ఉన్న పశువులను ఎండలో మేతకు పంపరాదు. ఉష్ణతాపం వల్ల హార్మోన్ల సమతుల్యత దెబ్బతిని పునరుత్పత్తి మీద ప్రభావం చూపుతుంది.

పశువుల్లో వడదెబ్బ లక్షణాలు

పశువులకు వడదెబ్బ తగిలినపుడు గుర్తించేందుకు ముందస్తుగా కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. పశువు అధిక శరీర ఉష్ణోగ్రతకు గురవడం, అధిక శ్వాస, నాడి, గుండె వేగంగా కొట్టుకోవడం, చొంగ ఎక్కువగా కార్చడం కనిపిస్తాయి. చర్మంపై వెంట్రుకలు బిరుసుగా తయారవుతాయి. వడదెబ్బ తీవ్రత ఎక్కువగా ఉన్నపుడు స్పృహ కోల్పోయి ప్రాణ నష్టం జరగవచ్చు. వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని ప్రదేశంలోకి తీసుకువచ్చి, శరీరంపై నీళ్లు చల్లి వెంటనే పశు వైద్యుణ్ని సంప్రదించి తగిన చికిత్స అందించాలి. తేలికగా జీర్ణం అయ్యే దాణా, గంజిలో ఉప్పు కలిపి ఆహారంగా ఇవ్వాలి. వైద్యులను సంప్రదించి డెక్రోజ్ సెలైన్ ద్రావణాన్ని రక్తనాళంలోకి పంపాలి. విటమిన్ ఏ, డీ సూదిమందులను విటమిన్ సీ, బీ కాంప్లెక్స్ సూది మందులను వేయించాలి. రోజుకు 40 లీటర్ల నీటిని తాగించాలి. పచ్చిమేతను అందించడం మంచిది.

అనకాపల్లి ఏడీ పరిధిలో పాడి పశువుల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు
అనకాపల్లి	8748	13676
కశింకోట	7096	10348
మొత్తం	15844	24024

జాగ్రత్తలు తప్పనిసరి



వేసవిలో రైతులు పశువుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. పశువుల పాక వద్ద పేడ, పెంట కుప్పలపై వాలే దోమలు, ఈగల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి. పచ్చ గడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన యూరియా గడ్డిని అందిస్తే ఫలితం ఉంటుంది. ఈ గడ్డిలో 45–55 శాతం వరకూ తేమ ఉంటుంది. దీనిని మేతగా అందించడం వలన శరీర ఉష్ణోగ్రత తగ్గి పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

– బి.సౌజన్య, ఏడీ, పశుసంవర్ధక శాఖ, అనకాపల్లి

ఎండీయూ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి వినతి

తుమ్మపాల : రేషన్ సరుకుల(ఎండీయూ) వాహన ఆపరేటర్ల జీతాల నుంచి ఎటువంటి సమాచారం లేకుండా బ్యాంకు ఆఫ్ బరోడా అధికారులు బీమా పేరిట రూ.19 వేల నుంచి రూ.26 వేల వరకు కట్ చేయడంతో పాటు, తమ సమస్యల పరిష్కారం కోరుతూ జేసీ కల్పనాకుమారికి ఎండీయూ ఆపరేట ర్ల సంఘం ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఎండీయూ వాహనాలకు గిడ్డంగుల నుంచి అందించే సరకు(బస్తాల) తూకంలో తేడాలు లేకుండా ఇవ్వాలని ఏడాది క్రితం ప్రభుత్వం జీవో ఇచ్చినా, అధికారులు నేటికీ అమలు చేయట్లేదని ఆరోపించా రు. ఐసీడీఎస్, ఎండీఎం కమిషన్ ఆరు నెలల నుంచి బకాయి ఉందన్నారు. బ్యాంకు నుంచి సకాలంలో వాహనాల ఇన్సురెన్స్ కాపీలు ఇవ్వక, వాహనాల ఫిట్‌నెస్ గడువు ముగిసి అదనపు రుసుము చెల్లించా ల్సి వస్తోందన్నారు. ఆపరేటర్లు, హెల్పర్లకు ప్రమాదబీమా వర్తింపజేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ జట్టి శ్రీను, వైస్ ప్రెసిడెంట్ ఇంటి శ్రీనివాసరావు, కార్యదర్శి బంగారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

‘సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలించొద్దు’

తుమ్మపాల : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వసతులు లేని చోటికి తరలిస్తుండటంపై అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులు స్పందించాలని ఆర్టీఐ, వినియోగదారుల రక్షణ చట్టాల ఉద్యమ కర్త కాండ్రేగుల వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. పట్టణంలో ప్రజలందరికి అందుబాటులో ఉన్న కార్యాలయాన్ని పట్టణానికి దూరంగా తరలించొద్దన్నారు.

కోడుగంటికి ఘన నివాళి



గోవిందరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

అనకాపల్లి రూరల్ : ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా నిరంతరం శ్రమించి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన దివంగత సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే కోడుగంటి గోవిందరావు శత జయంతి ఉత్సవాలను ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి శుక్రవారం ప్రారంభించారు. పట్టణంలోని రోటరీ హాల్లో జరిగిన కార్యక్రమంలో కోడుగంటి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజాసంక్షేమం కోసం ఎమ్మెల్యే పదవిని తృణప్రాయంగా వదిలిపెట్టిన నాయకునిగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం 70 ఏళ్ల వయసులో కూడా ఆయన భూపోరాటాలకు నాయకత్వం వహించడాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ ఏడాది పొడవునా గోవిందరావు శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్ నీలబాబు, సీపీఎం నాయకులు కాళ్ల లోకనాథం, రావు జగ్గారావు, సీపీఐ నాయకులు దొరబాబు, రామునాయుడు, విమల, వైఎస్ భద్రం, మళ్ల మాధవరావు, గురుబాబు, అప్పలరాజు, డీసీహెచ్ క్రాంతి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొండల రావు, అర్జున్, వియ్యపు రాజు, కోరిబిల్లి శంకర్రావు, గోవిందరావు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి



కరపత్రాలను పంచుతున్న సీఐటీయూ నాయకులు

కశింకోట : కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ ఈ నెల 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. మండలంలోని తేగాడ గ్రామంలో శుక్రవారం చలో ఢిల్లీ కర పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుని కల్యాణం నేడు



అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



ఆలయంలో వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి

కశింకోట : స్థానికంగా ప్రసిద్ధి చెందిన పురాతన లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవానికి శుక్రవారం రాత్రి అంకురార్పణ జరిగింది. ఏటా చైత్ర శుద్ధ ఏకాదశి రోజున పెద్ద ఎత్తున ఇక్కడ స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ముందు రోజు వేదమంత్రాల నడుమ అంకురార్పణ నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణ చేశారు. శనివారం రాత్రి 7 గంటలకు లక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారిని పూలు, పూమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కల్యాణం సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు.

ఒడ్డుకు కొట్టుకొస్తున్న చేపలు



కశింకోట వద్ద శారదానదిలో దొరికిన చేప

కశింకోట : కశింకోట వద్ద శారదానది ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం సందడి నెలకొంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వ్యర్థాల వల్ల నీరు కలుషితం కావడంతో రొయ్యలు, కొరమేను, బొమ్మిడాలు తదితర చేపలు నీటిలో ఉండలేక ఒడ్డుకు చేరుతున్నాయి. దీంతో వాటిని స్థానికులు పోటీలు పడి పట్టుకున్నారు. రాత్రి కూడా నది ఒడ్డు వెంబడి సెల్ ఫోన్ లైట్ల వెలుగులో చేపల వేట సాగించారు. నీరు కలుషితమై రంగు మారిందని, అందుకే చేపలు మృతి చెందుతున్నాయని స్థానికులు చెప్తున్నారు.

ఉత్తమ చదువుతో.. ఉన్నత స్థాయి

తుమ్మపాల : గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు చాలా చురుగ్గా ఉంటారని, పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి సురేష్‌కుమార్ సూచించారు. పట్టణంలోని మహాత్మా జ్యోతీబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సమయాన్ని వృథా చేయకుండా ఏకాగ్రతతో చదవాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకోవాలనే తపన ప్రతి విద్యార్థిలో ఉండాలన్నారు. తాను కూడా సంక్షేమ హాస్టల్లో ఉంటూ చదువుకుని, ఐదు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. చదువే మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతుందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని వారిలో స్ఫూర్తి నింపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తర్ఫీదునిచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గౌరీ పీఏసీఎస్ వార్షిక బడ్జెట్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణఅప్పారావు

అనకాపల్లిటౌన్ : పంటలు పండించే రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని గౌరీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల కృష్ణఅప్పారావు అన్నారు. గవరపాలెం వీవీ రమణ రైతు భారతి ఫంక్షన్ హాల్లో శుక్రవారం మహాజన సభలో ఆయన మాట్లాడారు. తొలుత స్వర్గీయ రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు ఇస్తున్న ల్యాండ్ మార్టిగేజ్ రుణం రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచేందుకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించినట్టు వెల్లడించారు. 2023–24 వార్షిక అంచనా బడ్జెట్‌ను సంఘం సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు మళ్ల అప్పలనాయుడు, కర్రి మోదినాయుడు, కార్యదర్శులు పీఈవీ ప్రసాదరావు, కొణతాల సూర్యారావు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్ : పట్టణ పరిధిలో విద్యుత్ వైర్ల వద్ద జంగిల్ క్లీనింగ్‌లో భాగంగా శనివా రం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి విద్యుత్‌శాఖ ఈఈ రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాకాశీవీధి, వేల్పులవీధి, మల్లి మణుగులవారివీధి, కోట్నివీధి, గాంధీబొమ్మ జంక్షన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

హెచ్‌డీఎఫ్‌సీ శాఖ ప్రారంభం

సబ్బవరం: సబ్బవరంలో ఏర్పాటు చేసిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నూతన శాఖను శుక్రవారం మెరైన్ ప్రొడక్ట్స్ అండ్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. ప్రసాద్ నాయక్ ప్రారంభించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలను హెచ్‌డీఎఫ్‌సీ అందిస్తుందని తెలిపారు.

భూసార పరీక్షలపై శిక్షణ



వ్యవసాయాధికారులకు శిక్షణ ఇస్తున్న రామలక్ష్మి, శిరీషాలు

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ జిల్లా వ్యవసాయాధికారులకు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం భూసార పరీక్షలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ పీవీకె జగన్నాథరావు, భూసార శాస్త్రవేత్తలు రామలక్ష్మి, శిరీషా పాల్గొన్నారు. మట్టి నమూనాల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో పంటలు పండించేందుకు రైతులకు అవగాహన కల్పించేలా వ్యవసాయాధికారులకు శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గంలో ప్రభుత్వం అగ్రిల్యాబ్‌లు ఏర్పాటు చేసిందని, వీటిలో కూడా భూసార పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న

కశింకోట : రైతులు ప్రకృతి వ్యవసాయం దిశగా దృష్టిసారించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్ లచ్చన్న సూచించారు. మండలంలోని జి.భీమవరం గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ నిర్వహణపై స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దీనివల్ల భూమి సారవంతంగా ఉండటంతోపాటు ఆరోగ్యకరమైన ఉత్పత్తులు చేతికి అందుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తొలకరి వర్షాలకు ముందు వేసే 30 రకాల విత్తనాలు(పీఎండీఎస్) ఎకరాకు 12 కిలోలు వంతున నాటాలన్నారు. దీనివల్ల భూమి పూర్తిగా ఆరోగ్యవంతంగా మారి, ఎలాంటి ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదన్నారు. చీడపీడల్ని తట్టుకుంటుందన్నారు. దీనివల్ల పురుగుల మందుల ఖర్చులు బాగా తగ్గుతాయన్నారు. కలుపు నివారణ కూడా జరుగుతుందన్నారు. పంటకు కావాల్సిన పోషకాలు భూమిలో ముందుగా తయారై నిల్వ ఉంటాయని తెలిపారు. దత్తత తీసుకున్న గ్రామాల్లో తప్పనిసరిగా అందరూ ప్రకృతి వ్యవసాయం సాగించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కృత్రిమ ఎరువులు ఎవరైనా వాడితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇళ్ల వద్ద 18 రకాల కూరగాయల సాగు

ప్రకృతి సిద్ధంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద 18 రకాల కూరగాయల్ని పెంచుకోవచ్చని లచ్చన్న సూచించారు. ఇళ్ల ముంగిట స్థలం లేని వారు ఇళ్ల పైన, కవర్లలో మట్టి వేసి గోడలు, సన్‌షేడ్‌లపై కూడా కూరగాయలు పండించుకోవచ్చన్నారు. ఉప్పు తప్ప బయట కృత్రిమ ఎరువులతో పండించిన కూరగాయలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సమావేశంలో అదనపు ప్రాజెక్టు మేనేజర్ స్వామినాయుడు, జిల్లా ఇన్‌చార్జి గోవింద్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, పంచాయతీ కార్యదర్శి చిన్నోడు, మండల ప్రకృతి వ్యవసాయం సిబ్బంది డి.రమణ, కె.అరుణ, దేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి అమర్‌నాథ్ చేతుల మీదుగా ‘ఆసరా’

అనకాపల్లి రూరల్ : మండలానికి సంబంధించి మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధుల పంపిణీ వారోత్సవాల్లో భాగంగా శనివారం తుమ్మపాల బంగార్రాజు ల్యాణ మండపం వద్ద సమావేశం నిర్వహించనున్నట్లు వెలుగు ఏపీఎం కుమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అనకాపల్లి మండలంలోని 1862 సంఘాలకు చెందిన లబ్ధిదారులకు రూ13.92 కోట్ల నమూనా చెక్కును అందిస్తారని పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

కశింకోట : మండలంలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నెలకొల్పనున్న స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ కల్పించి ప్రముఖ ప్రైవేటు పరిశ్రమలు, సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇన్వెంటరీ క్లర్క్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఏసీ ఫీల్డు టెక్నీషియన్, ఆటోమోటివ్ సర్వీస్ టెక్నీషియన్, ఫార్మసీ అసిస్టెంట్, ప్రొడక్షన్ కెమిస్ట్, సూయింగ్ మెషిన్ ఆపరేటర్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. టెన్త్ నుంచి పీజీ వరకు విద్యార్హతలు కలిగి, 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం ఎం.ప్రసన్నకుమార్, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, అనకాపల్లి జిల్లా, సెల్ నెంబర్ 63007 93328లో సంప్రదించాలని కోరారు.

ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తనలు



సంకీర్తనలు ఆలపిస్తున్న గాయక బృందం

అనకాపల్లిటౌన్ : గవరపాలెం పెదరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృందంచే శుక్రవారం ఆలయ ఆవరణలో భక్తి సంకీర్తన కార్యక్రమం జరిగింది. 100 మంది గాయకులు కీర్తలను ఆలపించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, భాస్కరరావు దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన హెల్మెట్లతో రక్షణ

మునగపాక: ప్రతి ఒక్కరూ నాణ్యమైన హెల్మెట్‌లు వినియోగించాలని ఎస్ఐ మహమ్మద్ అలీ కోరారు. శుక్రవారం ఆయన మునగపాక మెయిన్‌రోడ్డుపై వాహన తనిఖీలు నిర్వహించారు. అధిక లోడ్‌తో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.